

యాడికి మండలం పెద్దపేటలో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)



పట్టుకోండి చూద్దాం..!

పోలీసులకు దొంగల సవాల్

- అనంతపురం క్రైం

జిల్లాలో దొంగలు పేట్రేగిపోతున్నారు. కొంతకాలంగా జరుగుతున్న వరుస దొంగతనాలు జిల్లా ప్రజానీకంలో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. జిల్లా ఎస్పీగా అన్బురాజన్ వాటిని నియంత్రించడంలో విఫలమయ్యారనే విమర్శలొచ్చాయి. కొత్తగా వచ్చిన ఎస్పీ అమిత్ బర్దర్ అయినా చోరీలపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టి నియంత్రించాల్సి ఉంది.

- జిల్లాలో పేట్రేగిపోతున్న దొంగలు
- వరుసగా ఇళ్లలో దొంగతనాలు
- అంతంత మాత్రంగానే రికవరీ
- పోలీసుల పనితీరుపై విమర్శలు



శింగనమల మండలం నాయనపల్లి క్రాస్‌లో జరిగిన దొంగతనం గురించి పోలీసుల ఆరా (ఫైల్)

జిల్లాలో జరుగుతున్న దొంగతనాలు పోలీస్ శాఖకు సవాల్‌గా మారాయి. దొంగతనాలను నియంత్రించే పని చేయలేకపోయారు. అటు రికవరీ కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు. నగరంలో సైతం టైర్ల దొంగతనాల నుంచి బంగారు ఆభరణాల వరకు ఎత్తుకెళ్లారు.

పోలీసులకు సవాలే...

కొందరు పోలీస్ సిబ్బంది తమకు రావాల్సిన ఆదాయాలపై మాత్రమే దృష్టి పెడుతున్నారన్న ఆరోపణలను మూటగట్టుకుంటున్నారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమరాలు పనిచేయకపోయినా వాటిని మరమ్మతు చేయించాలనే ఆలోచన చేయలేకపోతు న్నారు. చాలా ఘటనల్లో సీసీ పుటేజీలు లేక దొంగలెవరో తేల్చలేక పోలీసులు చేతులెత్తేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కొత్త ఎస్పీ దొంగతనాలపై ఎంత మాత్రం దృష్టి సారిస్తారో వేచి చూడాల్సిందే.

మచ్చుకు కొన్ని..



యాడికి మండలం రాయలచెరువులోని సంతోష్ ఇంటిలో బీరువాను పగలగొట్టిన దొంగలు(ఫైల్)

- వారం రోజుల కిందట తాడిపత్రిలోని ఓ దుస్తుల దుకాణంలో చీరలు కొనడానికి వచ్చిన కొందరు 12చీరలు దొంగతనం చేశారు. సీసీపుటేజీలో వారు అడ్డంగా దొరికిపోయారు. వారి నుంచి 12 చీరలు స్వాధీనం చేసుకున్నారు.
- మార్చి 27న యాడికి మండలం రాయలచెరువులో ఒకే రోజు తాళాలు వేసిన రెండు ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి. మాదాల సంతోష్ ఇంట్లో ఆరుతులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అదే గ్రామంలోని సరస్వతమ్మ ఇంట్లో 10తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. అదే రోజే మరో రెండు ఇళ్లల్లో చోరీకి యత్నించారు.
- ఈనెల 6న రాయలచెరువులోని సెల్‌ఫోన్ దుకాణంలో ఐదు స్మార్ట్ ఫోన్లు, నాలుగు కీ ప్యాడ్ సెల్‌ఫోన్లు చోరీ చేశారు.
- గత నెల 30న యాడికి మండలం పెద్దపేట గ్రామంలోని రషీద్ బాషా ఇంట్లో నాలుగు గ్రాముల బంగారు, కొన్ని వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు వీటిని రికవరీ చేశారు.
- నెలరోజుల కిందట యాడికిలోని కుంటలో ఒక రోజు రాత్రి మూడు దుకాణాల్లో దొంగలు పడ్డారు. బాబుకు చెందిన దుకాణంలో రూ.30వేల విలువైన సిగరెట్లు, చంద్రశేఖర్ దుకాణంలో రూ.20వేల నగదు చోరీ చేశారు. మరో వ్యక్తి దుకాణంలో రూ.5వేల విలువైన సిగరెట్లు ఎత్తుకెళ్లారు.
- 8న రాత్రి శింగనమల మండలం నాయనపల్లి క్రాస్‌లో భారీ దొంగతనం జరిగింది. కమలమ్మ ఇంట్లో రూ.5లక్షలు, 5తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.
- ఫిబ్రవరి 24న గార్లదిన్నె మండలం కల్లూరులో చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో 50 తులాల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ చోరీ కేసును పోలీసులు ఇంకా తేల్చనే లేదు.
- ఈనెల 4న పట్టపగలే గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో తులశమ్మ ఇంట్లో భారీ చోరీ జరిగింది. తిమ్మంపేటలో ఓ ఫంక్షన్ కోసం ఉదయం 11.30గంట సమయంలో తులశమ్మ బయలుదేరింది. మధ్యాహ్నం 2గంటలకు ఇంటికి చేరుకుంది. అప్పటికే ఇంట్లో చొరబడిన దొంగలు 50తులాల బంగారు ఆభరణాలు, రూ.3లక్షలు ఎత్తుకెళ్లారు.
- ఈనెల 8న ఉరవకొండ మండలం పెద్దకౌకుంట్ల కటవాంజనేయస్వామి ఆలయంలో 40తులాల వెండి ఆభరణాలు, రూ.5వేలు ఎత్తుకెళ్లారు. మార్చి 21 ఉరవకొండ మండలం రాయంపల్లిలోని పర్వతప్పస్వామి ఆలయ హుండీలో రూ.70వేలు చోరీ చేశారు.
- మూడు రోజుల క్రితం గుత్తిఆర్ఎస్‌లోని సున్ని రోషన్ మసీదులో చోరీ జరిగింది. హుండీలోని రూ.20వేలు ఎత్తుకెళ్లారు. కొన్ని రోజుల కిందట రెండు టీ దుకాణాల్లో చోరీ జరిగింది. రూ.20వేల విలువైన సిగరెట్ బండిళ్లు, రూ.10వేల నగదు అపహరించారు.

తాళం పడిందా నిలువు దోపిడీనే !

తాడిపత్రిలో చెలరేగుతున్న దొంగలు

తాడిపత్రి టౌన్: కొన్నినెలలుగా తాడిపత్రిలో తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా వరుస చోరీలు జరుగుతున్నాయి. వరుసగా రెండు, మూడు రోజులు ఇంటికి తాళం పడిందా ఇక నిలువు దోపిడీనే అనే పరిస్థితులు పట్టణంలో ఉన్నాయంటే పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈక్రమంలోనే ప్రజలు ఇళ్లు విడిచి వెళ్లాలంటే జంకుతున్నారు. దొంగతనాల కేసుల్లో రికవరీ సైతం ఆశించిన స్థాయిలో ఉండటం లేదని బాధితులు పేర్కొంటున్నారు. అందుకే పలువురు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి కూడా విముఖత చూపుతున్నట్లు సమాచారం. మరోవైపు పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ తిరగడం మానేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- గతేడాది నవంబరు 11న విజయనగర్‌కాలనీలో నివాసం ఉంటున్న రామకృష్ణనాయక్ కుటుంబ సభ్యులతో ఊరికి వెళ్లగా, ఇంట్లో దొంగలుపడి బీరువాలో ఉన్న 30తులాల వెండి, తులం బంగారు దోచుకెళ్లారు. ఇదే కాలనీకి చెందిన విశ్రాంత క్లర్క్ శ్రీరంగయ్య బెంగళూరుకు వెళ్లాడు. పదిరోజులు రాకపోవడంతో దుండగులు ఇంటిలోకి చొరబడి 7తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు.
- నెల కిందట సాయినగర్‌లో ఇమాం బాషా రెండురోజులు ఊరికి వెళ్లగా ఇంటిలోని 30తులాల బంగారు, రూ.6లక్షల నగదును దుండగులు దోచుకెళ్లారు. సంజీవనగర్ మొదటిరోడ్డులో ఉన్న ఏటీఎంలో చోరీకి దొంగలు విఫలయత్నం చేశారు.
- మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న వెంకటరామిరెడ్డి ఇంటిలో భార్యను కత్తితో పొడిచి దొంగతనానికి ప్రయత్నించగా, ఆమె కేకలు విని భర్త రావడంతో దుండగులు పారిపోయారు.
- మెయిన్‌బజారులో ఒక బంగారు దుకాణంలో రాత్రి సమయంలో డోర్‌ను పగలగొట్టి కాళ్లపట్టీలు, వెండి ఆభరణాలు దుండగులు ఎత్తుకెళ్లారు.
- యల్లనూరు రోడ్డులోని శివానగర్‌లో ఇంటి నిర్మాణం చేపట్టిన సురేష్‌బాబు బయట కడ్డీలను ఉంచాడు. వీటిని కూడా వదలని దుండుగులు రూ.14వేలు విలువగల కడ్డీలను ఎత్తుకెళ్లారు.
- శ్రీనివాసపురం, నందలపాడు, మార్కెట్ యార్డు, సంజీవనగర్, టైలర్స్‌కాలనీ, అంబేడ్కర్‌నగర్, పోరాటకాలనీ, సీపీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇళ్లముందు పార్క్ చేసిన బైక్‌లు, సైకిళ్లు, ఆటో, కార్లకు ఉన్న టైర్లను ఎత్తుకెళ్లారు.
- గన్నెవారిపల్లికాలనీ, సజ్జలదిన్నె, చిన్నపొలమడ ప్రాంతాల్లో దొంగతనాలు అధికమయ్యాయి. బంగారం, నగదుతోపాటు బహిరంగ ప్రదేశాల్లో సెల్‌ఫోన్ల దొంగతనాలు అధికమయ్యాయి.



విజయనగర్ కాలనీలో బీరువాను పగలగొట్టిన దుండగులు (ఫైల్)

వైసీపీ నేతల దర్జా

రెండేళ్లుగా జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌లో తిష్ట

దుకాణాల అద్దె ఆదాయం బొక్కుతున్నారు

రెండేళ్లుగా పట్టించుకోని అధికారులు




రాయదుర్గంలోని జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్

రాయదుర్గం, ఏప్రిల్ 13: ప్రభుత్వ ఆదాయం కోసం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను కొంతమంది వైసీపీ నేతలు కబ్జా చేశారు. దర్జాగా అద్దెకు ఇచ్చి నెల నెలా ఆ సొమ్మును తమలో జేబుల్లో వేసుకుంటున్నారు. రాయదుర్గం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో రూ.25 లక్షల జడ్పీ నిధులతో ఎనిమిది గదులతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. 2019లో కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాంప్లెక్స్‌కు వేలం వేసి అద్దెకు ఇవ్వాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు. దీంతో కాంప్లెక్స్ గదులపై కన్నేసిన వైసీపీ నేతలు ఏకంగా అధికారుల అనుమతి లేకుండా కబ్జా చేసి తిష్టవేశారు. పైగా వాటిని అద్దెకు ఇచ్చి దర్జాగా సొమ్మును దిగమింగుతున్నారు. జిల్లా పరిషత్ అధికారులు దీని వెనుక కుమ్మక్కు వ్యవహారం నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లా పరిషత్ ఆదాయం కోసం ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ వైసీపీ నేతలకు వరంగా మారింది. ఇప్పటి వరకు చిల్లిగవ్వ కూడా ప్రభుత్వానికి చెల్లించకుండా ఉన్నారని తెలుస్తోంది.


రెండేళ్లుగా రూ. 9.60 లక్షలు స్వాహా

ప్రధాన రహదారిపై నిర్మించిన జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్‌ను వైసీపీ నేతలు పంపకాలు చేసుకుని వచ్చే బాడుగను తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ఒక్కోగదిని రూ. ఐదు వేల ప్రకారం అద్దెకు ఇచ్చారు. ఎనిమిది గదులకు రూ. 40 వేలు నెల నెలా ఆయా నాయకులకు చేరుతోంది. దీని ప్రకారం రెండేళ్లకు రూ. 9.60 లక్షల సొమ్మును అద్దె రూపంలో వైసీపీ నేతలు జేబులో వేసుకున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను అద్దెకు ఇవ్వాలంటే జిల్లా పరిషత్‌లో సంబంధిత విభాగపు అధికారులు బహిరంగవేలం వేయాలి. వేలంపాటలో పాల్గొని దుకాణాలను కైవసం చేసుకున్న వారు నెల నెలా జడ్పీకి అద్దె చెల్లించి వాటిని వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ తతంగమంతా లేకుండా ఏకంగా డిమాండ్ ఉన్న ప్రాంతంలో ఖాళీగా ఉన్న కాంప్లెక్స్‌ను తమ వశం చేసుకుంటే ఆదాయం వస్తుందనే ఆశతో వైసీపీ నేతలు సిండికేట్‌గా ఏర్పడి ఒక్కో గదిని ఒక్కొక్కరు తీసుకుని అనుభవిస్తున్నారు. అందుకు తెరిచి ఉన్న దుకాణాలు అందులో జరుగుతున్న వ్యవహారాలే సాక్ష్యం. కాగితాలలో జిల్లా పరిషత్‌కు సంబంధించిన కాంప్లెక్స్ ఇప్పటి వరకు ఎవరికీ అద్దెకు ఇవ్వలేదన్నట్టుగా ఉంది. క్షేత్ర స్థాయిలో మాత్రం వైసీపీ నేతలు అనుభవిస్తున్నారు.



అధికారుల కుమ్మక్కు

ప్రభుత్వం ఆదాయం కోసం పరితపిస్తున్న పరిస్థితుల్లో నెలకు రూ. 40 వేలకు పైగా వచ్చే కాంప్లెక్స్‌ను ఎందుకు వదిలేసిందనే విషయం అంతుబట్టని విధంగా ఉంది. 2019లో కాంప్లెక్స్ ప్రారంభించిన వెంటనే టెండరు పద్ధతిలో గదులను అద్దెకు ఇచ్చి ఉంటే ప్రభుత్వం నిర్మాణానికి వెచ్చించిన రూ. 25 లక్షలు రికవరీ అయ్యేవి. కొందరు దీనికి సంబంధించిన విభాగం అధికారులు వైసీపీ నేతలతో కుమ్మక్కైనట్లు ఆరోపణలు ఉన్నాయి. నామమాత్రంగా కాగితాల్లో టెండర్లు వేయాలని ప్రతిపాదన పంపి ఆ దస్త్రాన్ని మూలన పడేసేలా చేసినట్లు తెలిసింది. దీంతో జడ్పీలో టెండరు వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించకుండా ఫైల్‌ను మూలనపడేసి వైసీపీ నేతలు చెల్లించే ముడుపులకు కక్కుర్తిపడి ఏకంగా ప్రభుత్వ ఆదాయానికే గండికొట్టారు. అద్దెరూపంలో దోచుకుంటున్న సొమ్ములో కొంత జడ్పీలోని కొందరు అధికారులకు చేరుతున్నట్లు సమాచారం. దీంతో రాయదుర్గంలో ఉన్న జిల్లా పరిషత్ కాంప్లెక్స్ వైపు కన్నెత్తి కూడా చూసే పరిస్థితిలో లేరని తెలుస్తోంది. మండల పరిషత్ అధికారులు కూడా దీనిపై చొరవ చూపలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో కాంప్లెక్స్ వెనుక జరుగుతున్న దోపిడీ వ్యవహారాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని ఇప్పటికే కొందరు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. జడ్పీ సీఈఓ తక్షణమే జోక్యం చేసుకుని వైసీపీ నేతల మేతపై విచారణ జరిపి వెంటనే కాంప్లెక్స్‌లను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



‘పది’ పరీక్షల్లో నిర్లక్ష్యంపై విచారణ

కూడేరు ఎంఈఓను తప్పించే యత్నాలు..?

అనంతపురం విద్య, ఏప్రిల్ 13 : కూడేరు హైస్కూల్లో పదో తరగతి పరీక్షల్లో జరిగిన నిర్లక్ష్యంపై అధికారులకు విచారణకు దిగారు. శనివారం అనంతపురం డివిజన్ డిప్యూటీ డీఈఓ, విచారణాధికారి శ్రీనివాసులు, రిపోర్ట్ ప్రజెంటింగ్ ఆఫీసర్, బెలుగుప్ప ఎంఈఓ మల్లారెడ్డి కూడేరు హైస్కూల్‌లో విచారణ చేశారు. గతనెల 26న పరీక్షా కేంద్రంగా ఉన్న కూడేరు స్కూల్‌ను డీఈఓ వరలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఎంఈఓ చంద్రశేఖర్, ఎస్‌జీటీ అడవిరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా వారికి షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. తర్వాత ఈ ఘటనపై డీఈఓ విచారణకు ఆదేశించారు. దీంతో అనంతపురం డిప్యూటి డీఈఓ శ్రీనివాసులు, బెలుగుప్ప ఎంఈఓ మల్లారెడ్డి విచారణ చేశారు. వారు ఇద్దరు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్)గా ఉన్న దిలీప్ కుమార్ డిపార్టుమెంటల్ ఆఫీసర్(డీఓ) నరహరితోపాటు, టీచర్ అడవి రాజు, అటెండర్ ముత్యాలప్పను విచారణ చేశారు. ఈ సందర్భంగా వారి నుంచి 10వ తరగతి పరీక్షల్లో ఆ రోజు ఏం జరిగిందనే విషయంపై వాంగ్మూలం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే డీఈఓకు ఇవ్వనున్నట్లు సమాచారం.



తప్పిస్తారా....?

ఈ ఘటనలో కూడేరు ఎంఈఓ చంద్రశేఖర్‌ను తప్పించేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కూడేరు పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిన ఎంఈఓపై డీఈఓ మండిపడ్డారు. ఒకే బెంచ్‌పై ఇద్దరేసి విద్యార్థులను ఎలా కూర్చోబెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూడేరులో మండలంలో బెంచీలు తక్కువ ఉంటే పక్క మండలాల నుంచి ఎందుకు తెప్పించుకోలేదని ప్రశ్నించారు. ఇప్పుడు విచారణ నుంచి ఆయనను తప్పించేందుకు కొందరు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. సంఘటపై విచారణను, చర్యలను నీరుగార్చే యత్నాలు చేస్తున్నట్టు స్పష్టమవుతోంది. మరి అనంతపురం పరీక్షల పరిశీలకుడు, ఆర్‌జేడీ రాఘవరెడ్డి ఈ ఘటనపై ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

విశ్వపై క్రిమినల్ కేసు నమోదు చేయండి

ఆయన ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు

జిల్లా ఎన్నికల అధికారికి పయ్యావుల ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

అనంతపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : ఉరవకొండ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తున్నాడని.. ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్‌ను పయ్యావుల కేశవ్ కలిశారు. విశ్వేశ్వరరెడ్డి ఎన్నికల నిబంధనల అతిక్రమిస్తున్న సంఘటనల వివరాలను అందజేశారు. అనంతరం కేశవ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఉరవకొండ పట్టణంలో పాత తేదీలతో కూడిన మాన్యువల్ ఇళ్ల పట్టాలను విశ్వేశ్వరరెడ్డి తన ఇంటి వద్ద పంచుతున్నాడని తెలిపారు. నిబంధనల అతిక్రమణలపై సాక్ష్యాధారాలతో జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. 2019 తర్వాత చేతిరాతలో రాసిన ఇళ్ల పట్టాలు లేవన్నారు. కేవలం ఆన్‌లైన్‌లో ప్రీప్రింటెడ్ పట్టాలు మాత్రమే ఉండాలన్నారు. అలాంటిది ఎన్నికల కోడ్ అమలు తర్వాత పాత తేదీతో డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జిగా ఉన్న తేదీలతో సంతకాలు పెట్టించి ఇళ్ల పట్టాలు పంచుతున్నారని వివరించారు. దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలంటూ మహిళా సంఘాలతో డీఆర్‌డీఏ అధికారులు సమావేశాలు నిర్వహించారని, వారితో ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకొని, అదనంగా రుణాలు ఇస్తామని, మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే బాగుంటుందని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల అక్రమాలకు పాల్పడిన వ్యక్తి విశ్వేశ్వరరెడ్డి అన్నారు. దొంగే దొంగ అని అరిచినట్లుగా వారే ముందుగా అరుస్తున్నారని తెలిపారు. ఉరవకొండలో ఓటరు జాబితాలో అవకతవకలకు పాల్పడినందుకు, ఆయన పుణ్యమా అని ఇద్దరు సీఈఓలపై చర్యలు తీసుకున్నారన్న విషయాన్ని విశ్వేశ్వరరెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. జిల్లాలో పెద్ద స్థాయి అధికారులు ఏ పరిస్థితికి వచ్చారో అందరికీ తెలుసని అన్నారు. 200 మంది బీఎల్‌ఓలకు నోటీసులు జారీ కావడంతో వారంతా రోడ్డునపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల నిబంధనల అతిక్రమణలపై చర్యలు తీసుకునే దాకా ఫిర్యాదులు చేస్తూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

నియోజకవర్గాలకు ఈవీఎంలు

- ఓటరు నమోదుకు నేటి వరకూ అవకాశం
- 25 తర్వాతనే ఓటర్ల తుది జాబితా
- జూలై 15వరకు తాగునీటికి సమస్య లేదు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్



అనంతపురం టౌన్, ఏప్రిల్ 13: ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈవీఎంలను పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య నియోజకవర్గాలకు తరలిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో శనివారం కమాండెంట్ కంట్రోల్ నోడల్ అధికారులతో కలిసి కలెక్టర్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పనిచేస్తున్నామని, దీనిపై ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం తమపై ఉందన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ ర్యాండమైజేషన్ చేపట్టి కేటాయించిన నియోజకవర్గాలకు తరలించి స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరుస్తున్నామని అన్నారు. ప్రస్తుతం పార్లమెంటు నియోజకవర్గ యంత్రాలు తరలిస్తున్నామని, ఆదివారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల యంత్రాలు తరలిస్తామని అన్నారు. ఈ యంత్రాల తరలింపును నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఏ సంఖ్య యంత్రం ఎక్కడికి వెళుతుందో కూడా ఎవరికీ తెలియదన్నారు. యంత్రాల తరలింపు వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. తాను, ఎస్పీ ఒక్కో వైపు వెళ్లి రూట్లను పర్యవేక్షించామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి కూడా వాహనాలు చెప్పిన రూట్లలో వెళుతున్నాయా లేదా అని పరిశీలిస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 2,236 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందుకు 20 శాతం అదనంగా యంత్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని నియమించి ఇప్పటికే శిక్షణ ఇస్తున్నామని అన్నారు. మే మొదటి వారంలో రెండో విడత శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి శిక్షణ కోసం 10 ఈవీఎం యంత్రాలను వినియోగిస్తున్నామన్నారు. ఆదివారం వరకు కొత్తఓటు నమోదుకు అవకాశం ఉందన్నారు. వచ్చిన దరఖాస్తులను వారంలో పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఈ నెల 25తర్వాతనే తుది ఓటరు జాబితా ఇస్తామని వెల్లడించారు. ఎండాకాలం కావడంతో జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జూలై 15వరకు జిల్లాలో తాగునీటి సమస్య ఉండదన్నారు. ఒకవేళ ఎక్కడైనా సమస్య వస్తే అక్కడ తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. జూలై నెల వరకు తాగునీటిని వృథా చేయకుండా ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జడ్పీ సీఈఓ హైఖోమ్ నిదియి, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి తోటకు నిప్పు

శింగనమల, ఏప్రిల్ 13: శింగనమలకు చెందిన టీడీపీ నాయకుడు అబ్దుల్‌జిలాని చీనీ తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఆయన చెరువు వద్ద తనకు ఉన్న 12 ఎకరాల్లో చీనీతోపాటు వరి పంట సాగుచేస్తాడు. శనివారం మధ్యాహ్నం తోట సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మంటలు తోట గట్టుకు వ్యాపించడంతో డ్రిప్పు వైర్లు, పైపులు 20 చీనీ చెట్లు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పడంతో పెన్నుప్రమాదం తప్పింది.



శింగనమలలో కాలిపోయిన డ్రిప్ వైరు

ప్రచారానికి సీనియర్లు దూరం

వైసీపీ అభ్యర్థి తీరుపై అసంతృప్తి

కూడేరు, ఏప్రిల్ 13: వైసీపీ సీనియర్ నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. కూడేరులో శనివారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారానికి పలువురు డుమ్మా కొట్టారు. సీనియర్ నాయకుడు పాటిల్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ కొండపల్లి మహేశ్వరీ, కూడేరు అగ్రి చైర్మెన్ బొజ్జియాదవ్ తదితరులు ప్రచారానికి దూరంగా ఉన్నారు. పార్టీలో తమకు సముచిత స్థానం కల్పించలేదని కొన్నాళ్లుగా వీరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కూడేరులో ప్రచారానికి వచ్చిన పార్టీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి తమను పట్టించుకోలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు మండలంలో చాలా మంది నాయకులు, కార్యకర్తలు అసంతృప్తితో పక్క పార్టీవైపు చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున విశ్వేశ్వర రెడ్డి తమ్ముడు మదుసూదన్ రెడ్డి ఎన్నికల బరిలో నిలబడ్డారు. ఆయనకు మద్దతుగా ఇప్పటికే కొందరు అసంతుష్టులు కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. మరి కొందరు కాంగ్రెస్ అభ్యర్థి మదుసూదన్ రెడ్డికి రహస్యంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

వలంటీర్ అదృశ్యం



భారతి (ఫైల్)

కూడేరు, ఏప్రిల్ 13 : మండలంలోని కల్లగళ్ల గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ అదృశ్యమైన సంఘటన వెలుగు చూసింది. పోలీసులు అందించిన వివరాల మేరకు కల్లగళ్ల గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్న భారతి అనే మహిళ శుక్రవారం వలంటీర్‌గా రాజీనామా చేయడానికి కూడేరుకు వచ్చింది. సాయంత్రమైన తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి ఎద్దడిని నివారించండి: కలెక్టర్



జల్లిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్

ఉరవకొండ, ఏప్రిల్ 13: జిల్లాలో తాగు నీటి సరఫరాపై దృష్టి సారించాలని, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కూడేరు మండలం ముద్దలాపురం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన మంచి నీటి పథకాన్ని, పీఏబీఆర్ డ్యాంను, సత్యసాయి మంచినీటి పథకం పంప్‌హౌస్‌ను, శ్రీరాంరెడ్డి తాగు నీటి పథకాన్ని శనివారం ఆయన పరిశీలించారు. డ్యాంలో ఉన్న నీటి నిల్వల వివరాలు, ఎన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు, ఎక్కడ సమస్యలు ఉన్నాయి తదితర వివరాలను అధికారులతో కలెక్టర్ ఆరా తీశారు. నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి సరఫరాపై నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే కూడేరు మండలంలోని జల్లిపల్లిలో కలెక్టర్ పర్యటించి నీటి సరఫరాపై ప్రజలతో మాట్లాడారు. నీరు సక్రమంగా వస్తున్నాయా.. ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో ఏవైనా ఇబ్బందులు వస్తే కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఇహషాన్‌బాషా, పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ సతీష్‌రెడ్డి, హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, అనంతపురం నగరపాలక సంస్థ ఈఈ సూర్యనారాయణ, డీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు	అనంతపురం	
గరిష్ఠం కనిష్ఠం	40.0	27.0

ఎందుకు అలా చేశారు..?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 13: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఆధారాలతో గుర్తించినా వారిని విధుల నుంచి ఎందుకు తొలగించలేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్.. డ్వామా అధికారులను వివరణ కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లను టీఏసీలో పెట్టడానికి కారణం ఏమిటని డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డిని ప్రశ్నించారు. 'రెండు నెలలు ఆగండి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని పీడీని ఆదేశించారు. దీంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల వివరాలు, ప్రజల నుంచి అందిన ఫిర్యాదులతో డ్వామా పీడీ నివేదిక సిద్ధం చేసేపనిలో పడ్డారు.

చదువుకోమంటే.. చచ్చిపోయారు..!

ఒకే రోజు ముగ్గురు విద్యార్థులు..

బిడ్డలారా.. అమ్మానాన్న ఏమైపోవాలి..?

బాగుపడమంటే.. ప్రాణం తీసుకుంటారా..?

ధర్మవరం/రొద్దం/తాడిపత్రి టౌన్, ఏప్రిల్ 13: ఉమ్మడి జిల్లాలో ఒకేరోజు ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించినందుకు, పరీక్షల్లో ఫెయిలౌతానన్న భయంతో ప్రాణం తీసుకున్నారు. తాము లేకుంటే అమ్మానాన్నలు ఏమైపోతారోనని ఒక్క క్షణం కూడా వారు ఆలోచించలేదు.



ఆత్మహత్య చేసుకున్న బాలుడు నాగచైతన్య

● బడికి వెళ్లలేదని తల్లిదండ్రులు మందలించడంతో ఐదో తరగతి విద్యార్థి నాగ చైతన్య(11) ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరం పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో శనివారం ఈ ఘటన జరిగింది. ఆర్టీసీ డ్రైవర్ రంగప్ప, శ్రీదేవి దంపతుల కుమారుడు నాగచైతన్య ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. బడికి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు.. శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించేలోగా మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



● సెల్‌ఫోన్ వాడొద్దని తల్లిదండ్రులు మందలించినందుకు తొమ్మిదో తరగతి విద్యార్థిని నందిని(14) ఆత్మహత్య చేసుకుంది. రొద్దం మండలం కె.మరువపల్లి గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. తన దత్త పుత్రిక నందిని ఎక్కువగా సెల్‌ఫోన్ చూస్తూ గడుపుతుండటంతో కుళ్లాయప్ప మందలించారు. పరీక్షల సమయంలో ఇలా మొబైల్ చూడటం మంచి పద్ధతి కాదని చెప్పి బయటకు వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన నందిని ఇంట్లో చీరతో ఉరివేసుకుంది. తల్లి కమలమ్మ ఆ సమయంలో స్నానానికి వెళ్లారు. తండ్రి తిరిగి వచ్చేలోగా నందిని ఉరికి వేలాడుతూ కనిపించింది. కిందకు దించి ఆసుపత్రికి తరలించేలోగా మృతిచెందింది. ఒక్కగానొక్క కూతురు బలవన్మరణానికి పాల్పడటంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. నందిని పైడేటి జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థిని.

● ఇంటర్ పరీక్షల్లో ఫెయిలవుతానన్న భయంతో ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఇందు (16) ఆత్మహత్య చేసుకుంది. కానీ ఫలితాలు వచ్చాక ఆమె పాసైనట్లు తేలింది. ఈ విషాద ఘటన తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, వరలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీలు. వీరికి ముగ్గురు సంతానం. రెండో కూతురు ఇందు అనంతపురంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ఫెయిల్ అవుతానన్న భయంతో, ఫలితాలు రాకమునుపే శుక్రవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను అనంతపురం తరలించారు. కోలుకోలేక శనివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో ఇందు 289 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. కూతురు మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.



21న మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి పరీక్ష

అనంతపురం విద్య, ఏప్రిల్ 13 : జిల్లాలోని 15 ఏపీ మోడల్ స్కూళ్లలో 2024-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆరో తరగతిలో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షలు ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు డీఈఓ వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు అన్ని మండలాల్లోని మోడల్ స్కూళ్లలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను http://cse.ap.gov.in,https://apms.apcfss.in/StudentLogin.do వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందని, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష రాయవచ్చని తెలిపారు.

మార్కెట్‌కు 1,125 టన్నుల చీనీకాయలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 1,125 టన్నుల చీనీ ఉత్పత్తులు వచ్చాయి. టన్ను గరిష్ఠంగా రూ.38 వేలు, కనిష్ఠంగా రూ.17 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు.

1 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తచెరువు, ఏప్రిల్ 13: మే ఒకటో తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని డీఐఈఓ రఘునాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల 18 నుంచి 24వ తేదీ వరకు కళాశాలల ప్రిన్సిపాళ్లకు పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులకు కూడా ఇదే షెడ్యూల్ వర్తిస్తుందని తెలిపారు.

బందీఖానాలో భూములు

నమ్మించి నట్టేట ముంచిన నాటి పాలకులు

15 ఏళ్లుగా లేపాక్షి హబ్ బందీఖానాలో ఉన్న భూములు ఇవే..



● భూముల కోల్పోయి.. ఉపాధి లేక రైతుల వలసబాట
● 15 ఏళ్లుగా 8,844 ఎకరాల భూమి నిరుపయోగం
● లేపాక్షి హబ్‌కు భూములిచ్చిన రైతుల్లో తీవ్ర ఆవేదన

పుట్టపర్తి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సైన్స్ టెక్నాలజీ పార్కులొస్తాయి.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలొస్తాయి.. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వస్తుంది.. మీ ప్రాంతమంతా పారిశ్రామిక హబ్‌గా మారి.. మీపిల్లకు కొలువులొస్తాయి.. మీ జీవితాలు మారిపోతాయంటూ లేపాక్షి నాలెడ్జ్‌హబ్‌ను ప్రకటించినప్పుడు వైఎస్ ప్రభుత్వం చెప్పిన మాటలివి. అప్పట్లో అరచేతిలో వైకుంఠం చూపి.. సాగులో ఉన్న పేదల నుంచి భూములు సేకరించి లేపాక్షి హబ్‌కు కారు చౌకగా కట్టబెట్టారు. అసైన్డ్ భూమి ఎకరాకు రూ. 1.75 లక్షలు, ప్రభుత్వ భూమికి రూ. 50 వేల చొప్పున ధర నిర్ణయించి చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 8,844 ఎకరాల భూమిని లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు రూ. 119.85 కోట్లకే కట్టబెట్టారు. చెప్పిన పరిశ్రమలు, ఉద్యోగాలు రాలేదు. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో పరిశ్రమలు తీసుకురాకపోగా వివిధ బ్యాంకుల్లో భూములను తాకట్టుపెట్టి కోట్ల రుణాలు పొందిన సంగతి తెలిసిందే. 15 ఏళ్ల కిందట చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో అప్పటి సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆయన కుమారుడు, ప్రస్తుత సీఎం జగన్‌కు సన్నిహితమైన ఇందూ గ్రూప్‌నకు అనుబంధంగా 2009లో లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో భూములు కేటాయించారు. అప్పట్లో వీరి మాయమాటలకు నమ్మిమోసపోయిన రైతులు నేటికి పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో ఉపాధి అవకాశాలు లేక పిల్లపాపలతో వలస బాట పడుతూనే ఉన్నారు. సాగు భూములు లేక చాలా మంది ఉపాధి కోల్పోయారు. లేపాక్షి హబ్ పేరుతో తమను రోడ్డుపాలు చేశారని రైతు కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి.



కొడికొండ చెక్‌పోస్టు వద్ద లేపాక్షి హబ్ కార్యాలయం

ఇంకెన్నాళ్లు..?

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో జాతీయ రహదారి 44 జిల్లా సరిహద్దు చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 2006లో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు చేసి పరిశ్రమల నిర్మాణం కోసం ఏపీఐఐసీ రైతుల నుంచి 8,844 ఎకరాలను సేకరించి లేపాక్షి హబ్‌కు విడతల వారిగా కట్టబెట్టింది. రైతుల నుంచి తీసుకున్న భూముల్లో పరిశ్రమలు తీసుకురాకపోగా వివిధ బ్యాంకుల్లో తాకట్టుపెట్టి లేపాక్షి నాలెడ్జ్‌హబ్ వందల కోట్లు పైగా రుణాలు పొందిన సంగతి తెలిసిందే. భూములు తాకట్టు పెట్టి రుణం పొందడం, నిధులను పక్కదారి మళ్లించడం, నిబంధనలు అతిక్రమించడంపై 2013లో సీబీఐ విచారణ చేసింది. అక్రమాలకు పాల్పడ్డారని నిర్ధారించి 3,800 ఎకరాలకుపైగా ఈడీకి అటాచ్‌మెంట్ చేశారు. ఆ భూములు నేటికి ఈడీ అటాచ్‌మెంట్‌లోనే మగ్గుతున్నాయి. అప్పట్లో లేపాక్షి హబ్ రూ. 119.85 కోట్ల వరకు రైతుల భూములకు పరిహారం రూపంలో ఇవ్వగా నేడు ఇవే భూములే రూ. 20 వేల కోట్ల దాకా పలుకుతున్నాయి. చాలా మంది సన్న చిన్న కారు రైతులు వచ్చిన పరిహారంతో బండ్లు, ఇల్లు, నగలు కొనేశారు. పరిశ్రమలు వస్తాయి ఉద్యోగాలు కల్పిస్తారు అని అనుకునేలోపే ఉన్నది కాస్త కరిగిపోయింది. సాగు చేసేందుకు భూములు లేక ఇచ్చిన భూములు పరిశ్రమలు రాకపోగా తమ భూములు బడాబాబులు బందీఖానాలో చిక్కుకుని నిరాశే మిగిల్చాయి.

కదిలిస్తే కంటతడి..

లేపాక్షి హబ్ కోసం భూములు కోల్పోయిన గ్రామాల్లో ఎవరిని కదిపినా కంటతడి పెడుతున్నారు. లేపాక్షిహబ్‌కు ఇచ్చేందుకు వైఎస్ ప్రభుత్వం చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో 6,313 ఎకరాల అసైన్డ్ భూములు సేకరించింది. ఇందులో 5,811 ఎకరాలను హబ్‌కు ఇచ్చింది. 3032 ఎకరాల ప్రభుత్వ భూములూ ఇచ్చింది. పరిహారం మాత్రం నామమాత్రంలోనే నిర్ణయించి ఎకరా మెట్ట భూమికి రూ.1.75 లక్షలు, నీటివసతి ఉంటే రూ. 2లక్షల ఇచ్చింది. ప్రస్తుతం ఆ భూములన్నీ ఈడీ ఆధీనంలో మగ్గుతున్నాయి. కొందరు రైతులు పంటలు వేసుకుంటున్నారు. భూమి వారిపేరిట లేనందున రుణాలు, సబ్సిడీ విత్తనాలు రావు. పంట నష్టపోతే బీమాతోపాటు పంట నష్ట పరిహారం కూడా రాదు. 15 ఏళ్ల కిందట అందిన కొద్దిపాటి పరిహారం కాస్తా కర్పూరంలా కరిగిపోయింది. ఇప్పుడు ఎకరా రూ. 50 లక్షల నుంచి రూ. రెండు కోట్ల దాకా పలుకుతుంటే రైతు కుటుంబాల తీవ్ర మానసికక్షోభకు గురవుతున్నాయి.

రూ.5 కోట్ల రుణానికి..

ఢిల్లీ సంస్థ నుంచి కేవలం రూ.5 కోట్లు రుణం తీసుకున్న లేపాక్షిహబ్ రూ. 1600 కోట్లకు పైగా విలువ చేసే 2,650 ఎకరాల భూమి ప్రైవేట్ చేతుల్లో పెట్టింది. ఈ అడ్డగోలు వ్యవహారమంతా కుట్రలా కనిపిస్తోంది. లేపాక్షికి ఇచ్చిన 8,844 ఎకరాల్లో 4,181 ఎకరాలను ఇందూ సంస్థ బ్యాంకుల్లో తాకట్టుపెట్టి అప్పు తీసుకుంది. లేపాక్షిహబ్ పేరుతో జరిగిన భూకుంభకోణంపై నాడు దర్యాప్తు చేసిన సీబీఐ తన చార్జీషీట్‌లో అప్పటి ముఖ్యమంత్రి తనయుడు, ప్రస్తుత సీఎం జగన్‌ను మొదటి నిందితుడిగా చేర్చింది. లేపాక్షి హబ్‌కు అక్రమంగా భూములు కేటాయించినందుకు ప్రతిఫలంగా జగన్ కంపెనీల్లో రూ. 70 కోట్ల పెట్టుబడులుగా వచ్చాయని పేర్కొంది.

పొరుగు రాష్ట్రానికి..

పరిశ్రమలు ఏర్పాటు చేయించి భూములు కోల్పోయిన రైతు కుటుంబాలతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని అప్పట్లో లేపాక్షి హబ్ హామీ ఇచ్చింది. భూములు తీసుకుని పలు బ్యాంకుల్లో తనాఖా పెట్టి వందల కోట్లు తీసుకుని భూములను ఈడీ అటాచ్‌మెంట్‌లోకి ఇరికించి రైతుతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకపోగా తీవ్రంగా మోసం చేసింది. లేపాక్షి హబ్‌కు భూములు ఇచ్చిన వేలాది మంది రైతు కుటుంబాలు కొన్నేళ్లుగా ఉపాధి కోసం చాలా మంది కర్ణాటకకు వలస పోతూనే ఉన్నారు. ఐదేళ్ల కిందట టీడీపీ హయాంలో రూ.13 వేల కోట్ల పెట్టుబడితో కియ కార్ల పరిశ్రమ పెనుకొండకు రాకతో జిల్లా ఆటోమొబైల్ హబ్‌గా విస్తరించింది. కియ పరిశ్రమతోపాటు అనుబంధ సంస్థల నిర్మాణంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు లభించాయి. అమ్మడి అనంత జిల్లాకు పారిశ్రామికంగా అభివృద్ధికి బాటలు వేసి పారిశ్రామికవేత్తలను ఆకర్షించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్ల గడిచినా కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా 15ఏళ్ల బందీఖానాలో పెట్టుకుని భూములు చిక్కుముడి తేల్చకపోవడంతో వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేక పరిశ్రమలు వస్తాయా అన్న ఆశతో నేటికి ఎదురుచూస్తోంది.



లేపాక్షి హబ్ లోగో

బజారున పడ్డాం



భూములు ఇస్తే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇస్తామని ఆ రోజు ప్రభుత్వం చెప్పింది. ఎన్నో ఏళ్లగా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న భూములను పరిశ్రమల పేరుతో అప్పట్లో ప్రభుత్వం లాగేసుకుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు భూములు కోల్పోయిన మాకు ఉపాధి చూపలేదు. ఒక పక్క భూములు కోల్పోయి, మరోపక్క ఉపాధి లేక కుటుంబాలను పోషించుకోవడం కోసం కర్ణాటకకు వెళుతున్నాం. వేల ఎకరాలు తీసుకొని ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదు. పిల్లలకు భవిష్యత్తు లేకుండా పోయింది. తీసుకున్న భూములను వెనక్కి ఇవ్వాలి. లేదంటే పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. **- గంగాధర్, చిన్నప్పరెడ్డిపల్లి, చిలమత్తూరు మండలం**

కారుచౌకగా కొట్టేశారు



మాయ మాటలు చెప్పి అప్పట్లో మా భూములను లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరుతో కారుచౌకగా కొట్టేశారు. భూములు ఇస్తే పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, ఉద్యోగాలు వస్తాయని ఆశ చూపారు. ఎకరం భూమిని కేవలం రూ. 1.75 లక్షలకే లాగేసుకున్నారు. ఇప్పుడు అదే భూములు ఎకరం కోటి వరకు ధర పలుకుతోంది. కనీసం భూములు కోల్పోయిన మాకు 15 ఏళ్లగా ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు పొట్ట చేతపట్టుకొని పరాయి రాష్ట్రాలకు వెళ్లి బతుకు సాగించాల్సి వస్తోంది. **- సూర్యనారాయణ, కంబాలపల్లి, చిలమత్తూరు మండలం**

నేటి నుంచి యోగి వేమన బ్రహ్మోత్సవాలు



యోగి వేమన ఆలయం



గాండ్లపెంట, ఏప్రిల్ 13: మండలంలోని కటారుపల్లిలో గల మహాకవి యోగివేమన ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 14వ తేదీన మహాశక్తి పూజ, కుంభం పోయిట నిర్వహిస్తారన్నారు. 15న చాందినీ బండ్ల మెరవణి, పానక పందేరాలు ఉంటాయన్నారు. 16న ఉట్ల తిరుణాళ్ల, రాత్రి 8గంటలకు అగ్ని సేవ ఉంటాయన్నారు. 17న బుధవారం గొడుగుల మెరవణి నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తు అధిక సంఖ్యలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 13: రైతుల ఖాతాల్లో పంటనష్ట పరిహారాన్ని వెంటనే జమ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత సంవత్సరం జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులకు వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన రూ.251 కోట్ల పరిహారం అమలు కాలేదని విమర్శించారు. అనంతపురం జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నెలన్నర అయినప్పటికీ ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాలకు జమ కాలేదన్నారు. రైతులు నష్టపోయిన పంటల విలువతో పోలిస్తే ప్రభుత్వం చెల్లించేది అతి తక్కువ పరిహారమేనని, అదికూడా సకాలంలో చెల్లించకపోవడం వారిని దగా చేయడమే అన్నారు. గతేడాది వర్షాలు లేకపోవడంతోపాటు ఈ రబీలో ఎండలు ఎక్కువై భూగర్భ నీటిమట్టం తగ్గి తోటలు ఎండిపోతున్నాయని తెలిపారు. వందల ఎకరాల్లో అరటి, చీనీ తోటలు ఎండిపోతున్నాయన్నారు. ఎన్నికల హడావిడిలో రైతులను, వారు ఎదుర్కొంటున్న కష్టాల గురించి పట్టించుకునే పరిస్థితిలో అధికార యంత్రాంగం లేదని విమర్శించారు. పంటనష్ట పరిహారంతోపాటు ఇన్‌పుట్ సబ్సిడీ కలిపి చెల్లిస్తే తప్ప రానున్న ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసే పరిస్థితులు లేవన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.51.27 లక్షల సీజ్



గుంతకల్లులో సీజ్‌చేసిన నగదును చూపుతున్న సీఐ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎలాంటి రసీదులు, బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న నగదును అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో అధికారులు శనివారం సీజ్ చేశారు. ఈ రెండు జిల్లాలో మొత్తం రూ.51.27 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నారు. గుంతకల్లులో రూ.2.50లక్షల నగదును సీజ్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. ఆలూరు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీలు చేపట్టామన్నారు. గుంతకల్లు మండలం సంఘాల గ్రామానికి చెందిన ఎస్ రామాంజనేయులు ఆదోని నుంచి కారులో నగదును తీసుకెళ్తున్నాడన్నారు. రైల్వే బ్రిడ్జివద్ద వాహనాలు తనిఖీలు చేయగా రూ.2.50 లక్షలకు ఎలాంటి బిల్లులు, రసీదులు లేకుండా తీసుకెళుతుండడంతో సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

ధర్మవరంలో 2.82 లక్షలు..

ఎటువంటి బిల్లులు లేకుండా నగదును తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.2.82 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం స్థానిక ఎర్రగుంట్ల సర్కిల్లో తనతోపాటు ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశామన్నారు. బుక్కపట్నం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన ఆర్వేటి రామాంజినేయులు ఎలాంటి బిల్లులు లేకుండా వాహనంలో రూ.2.82లక్షల నగదును తీసుకుకెళ్తుండటంతో నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

అనంతపురంలో రూ.1.65 లక్షలు..

అనంతపురం వన్‌టౌన్ పోలీసులు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంతో కలిసి రూ.1.65లక్షల డబ్బు సీజ్ చేశారు. శనివారం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, సిబ్బందితో కలిసి మార్కెట్‌యార్డు సమీపంలో తనిఖీలు నిర్వహించారు. కేరళకు చెందిన అన్వర్‌బాషా నుంచి రూ.1.65లక్షల నగదు తీసుకెళ్తుండగా ఆరా తీశారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆ డబ్బు సీజ్ చేశారు.

తాడిపత్రిలో రూ.22 లక్షలు..

ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.22లక్షల నగదును సీజ్‌చేసినట్లు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని కొత్తబ్రిడ్జి వద్ద సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐలు గౌస్‌బాషా, నాగవీరయ్య వాహనాలు తనిఖీ చేశారన్నారు. పట్టణంలోని కృష్ణాపురం 2వరోడ్డుకు చెందిన షేక్ సాదిక్, షేక్ మునీర్‌బాషా ద్విచక్రవాహనంపై రూ.22లక్షల నగదు తరలిస్తున్నట్లు గుర్తించారని అన్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలను చూపించకపోవడంతో సీజ్‌చేశామన్నారు. సమావేశంలో ఎన్నికల ఎఫ్‌ఎస్‌టీ టీం ఇన్‌చార్జ్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాడిపత్రి డీఎస్పీ, సీజ్‌చేసిన నగదు

హిందూపురంలో రూ. 15.10 లక్షలు..

హిందూపురం పట్టణంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నగదు పట్టుబడినట్లు టూటౌన్ సీఐ రియాజ్ అహమ్మద్ తెలిపారు. శనివారం గౌరీబిదనూరుకు చెందిన నాగరాజు, చంద్రశేఖర్ వద్ద రూ. 8లక్షలకు పైగా పట్టుబడిందన్నారు. ఈ నగదుని సీజ్ చేసి ట్రెజరీకి తరలించినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా కొడికొండ చెక్‌పోస్టులో వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారులో రూ. 7.10 లక్షలు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.

తనకల్లులో రూ.7.20 లక్షలు..

తనకల్లు మండల పరిధిలోని చీకటిమానుపల్లి చెక్ పోస్టు వద్ద శనివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేసి రూ.7.20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. గోరంట్ల మండలం కొత్తబయ్యన్నపల్లికి చెందినవడ్డే శ్రీనివాసుల వద్ద రూ.లక్ష, ఓడీసీ మండలం సున్నంపల్లికి చెందిన సుబహాన్ వద్ద రూ.91,800, మల్లెవాండ్లపల్లికి చెందిన గంగన్న వద్ద రూ.లక్ష, బసప్పగారిపల్లికి చెందిన రమణప్పవద్ద రూ.లక్ష, చెర్లోపల్లికి చెందిన హనుమంతు వద్ద రూ.90వేలు నగదు పోలీసులు స్వాధీనంచే సుకున్నారు. గోరంట్ల మండలం కొత్తబయ్యన్నపల్లికి చెందిన వడ్డె లక్ష్మీనారాయణ వద్ద రూ.2.41 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు.



ఎన్నికల ప్రచారంలో స్టోర్ డీలర్

అనంతపురంరూరల్, ఏప్రిల్ 13: మండలంలోని పూలకుంటలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి స్థానిక రేషన్ డీలర్ శంకరయ్య ఈ ప్రచారంలో పాల్గొన్నాడు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

శింగనమల, ఏప్రిల్ 13: మండలంలోని నాయనపల్లిక్రాస్‌లో హోటల్ నిర్వాహకురాలు కమలమ్మ ఇంట్లో సోమవారం జరిగిన చోరీ కేసులో నిందితులను శింగనమల పోలీసులు శనివారం పరిశీలించారు. కమలమ్మ, ఆమె కుమారుడు మిద్దెపైన నిద్రపోగా.. దుండగులు ఇంటి తాళం పగులగొట్టి.. బీరువాలోని రూ.5 లక్షలు, ఆరు తులాల బంగారు ఎత్తుకెళ్లిన విషయం తెల్సిందే. ద్విచక్రవాహనంపై ముగ్గురు వ్యక్తులు నార్పల క్రాస్‌లో అనుమానాస్పదంగా వెళ్తుండగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. తామే కమలమ్మ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారిని కొత్తచెరువుకు చెందిన సయ్యద్ ఇషాక్,.ధర్మవరానికి చెందిన బోయనాగార్జున, జింకాతరుణ్‌గా గుర్తించారు. వారి నుంచి ఆ నగదు, నగలతో పాటు బైక్, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

నేడు బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 13: బాస్కెట్‌బాల్ ఉమ్మడి జిల్లా జూనియర్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలను ఆదివారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి తెలిపారు. ఎంపికైన వారు ఈనెల 19 నుంచి నూజివీడులో నిర్వహించే రాష్ట్ర స్థాయి 9వ బాస్కెట్ బాల్ ఏపీ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు 93937 11324ను సంప్రదించాలన్నారు.

కేబుల్ వైర్ చోరీ

రాప్తాడు, ఏప్రిల్ 13: గంగలకుంట చెరువు వద్ద గల ఏడు మోటార్ల కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రాప్తాడు గ్రామ పంచాయతీ గంగలకుంట చెరువులోని రెండు పంచాయతీ మోటార్లు, రైతు కొండప్ప మూడు మోటార్లు, రైతు పరందామ రెండు మోటార్లకు గల కేబుల్ వైర్లు శుక్రవారం రాత్రి చోరీ అయ్యాయి. దీనిపై రాప్తాడు టీడీపీ సర్పంచ్ సాకే తిరుపాలు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డికి శనివారం ఫిర్యాదు చేశారు.

ఘనంగా తిక్కయ్యస్వామి ఉట్ల పరుష

ఉట్లపరుషలో పాల్గొన్న గ్రామస్థులు



నార్పల, ఏప్రిల్ 13: నార్పలలో ఘనంగా తిక్కయ్యస్వామి ఉట్ల పరుష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్వామికి ఆకుపూజ, కుంకుమార్చన నిర్వహించారు. యువకులు ఉట్లమాను ఎక్కడానికి ఒకరిపై ఒకరు పోటీ పడ్డారు. చివరకు నార్పలకు చెందిన భరత్ ఉట్లమాను ఎక్కి రూ.5,116ను బహుమతిగా పొందాడు. అలాగే టెంకాయ పగలకొట్టే పోటీలో నార్పలకు చెందిన వంశీ విజేతగా నిలిచి.. రూ.3,116 బహుమతిగా పొందాడు. సాయంత్రం తిక్కయ్యస్వామి ఉత్సవ మూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. అలాగే తిక్కయ్యస్వామి జన్మించి వందేళ్లు కావడంతో చెక్కభజనలు, పౌరాణిక నాటకాలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు సివిల్స్‌పై ఉచిత వర్క్‌షాప్

అనంతపురం విద్య, ఏప్రిల్ 13: యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలపై అభ్యర్థులకు, యువతకు ఆదివారం ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు నారాయణ ఐఏఎస్ అకాడమీ డీజీఎం, ఆర్అండ్‌డీ హెడ్ శివనాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రామచంద్రనగర్‌లో ఉన్న టీటీడీ కళ్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వర్క్‌షాప్‌కు తెలంగాణా రిటైర్డ్ ఏసీబీ డీజీపీ ఏకే ఖాన్ హాజరవుతారని, అభ్యర్థులు సందేహాలకు ఆయన సమాధానాలిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు, ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 81799 69829, 81799 69791 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నగలు చోరీ

నార్పల : మండలంలోని బొందల వాడలో శుక్రవారం అర్ధ రాత్రి చింతలపల్లి సూరి ఇంట్లో చోరీ జరిగింది. చింతలపల్లి సూరి ఎండకాలం కావడంతో కుటుంబ సమేతంగా మిద్దెపైన నిద్రించారు. దొంగలు ఇంటి తాళాలను రాడ్లతో తొలగించి బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని శనివారం పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నడిమి వంక ఏమైంది 'అనంతా'..!

కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 13 : నడిమి వంక ప్రొటెక్షన్ వాల్ సంగతి ఏమైంది ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అని అనంత అర్బన్ కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రశ్నించారు. శనివారం స్థానిక 42వ డివిజన్‌లో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఓంకార్‌రెడ్డి ఆధ్వర్యంలో వారికి భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వరదల సమయంలో నడిమి వంక నీరు ఇళ్లల్లోకి రావడంతో సర్వం కోల్పోయామని, నడిమి వంక నుంచి వచ్చే దుర్గంధం భరించలేకపోతున్నామని స్థానికులు ఆయన వద్ద వాపోయారు. వైసీపీ పాలనలో నడిమి వంక ఇరువైపుల ప్రొటెక్షన్ వాల్ నిర్మించ కుండా ఎమ్మెల్యే నిర్లక్ష్యం చూపారని ఆవేదన చెందారు. ఇందుకు దగ్గుబాటి స్పందిస్తూ... టీడీపీ అధికారంలోకి రాగానే నడిమి వంకకు ఇరువైపులా ప్రొటెక్షన్ వాల్ నిర్మించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అనంత ఎప్పుడైనా ఈ కాలనీల్లో పర్యటించారా అని నిలదీశారు. ఆయన పర్యటించి ఉంటే చిన్న చిన్న సమస్యలు ఎందుకు పరిష్కరించలేదన్నారు. ఇలాంటి నాయకుల ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదన్నారు. అనంత అర్బన్‌లో కూటమి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో నాయకులు జయరాం నాయుడు, సంగా తేజస్విని, సుధాకర్ యాదవ్, విశాలాక్షి, బాబాఫక్రుద్దీన్, దళవా యి వెంకటనారాయణ, సిమెంట్ పోలన్న, పోతుల లక్ష్మీనరసింహులు, రాజారావు, కూచి హరి, రాయల్ మురళీ పాల్గొన్నారు.



ఓటు అభ్యర్థిస్తున్న దగ్గుబాటి ప్రసాద్

అరాచకాలే తప్ప... అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే తోపుపై కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత ధ్వజం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 13: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాప్తాడు నియోజకవర్గంలో తోపుల ఆరాచకాలే తప్పా... చేసిన అభివృద్ధి శూన్యమని కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత మండిపడ్డారు. నెల రోజుల తరువాత ప్రజా పాలన రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని వెంకటంపల్లి, ఒంటికొండ, చిన్నమొగలాయపల్లి, పెద్దమొగాలయపల్లి గ్రామాల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి రాప్తాడు అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేశాడన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే ప్రాజెక్టులు నిర్మిస్తామంటూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్భాటంగా శంకుస్థాపనలు చేయించారే తప్ప... ఇప్పటి వరకు పట్టెడు మట్టికూడా తీయలేదని అన్నారు. ఇక గ్రామాల రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఈ ఐదేళ్లు తోపు సోదరులు దోపిడీ, దౌర్జన్యాలు, భూ కబ్జాలు, షెటిల్‌మెంట్లలతోనే కాలం నెట్టుకొచ్చారన్నారు. తీరా ఇప్పుడు ఎన్నికలు వచ్చే సరికి మళ్లీ ప్రజలకు వద్దకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని,వారికి ప్రజలు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్‌నారాయణచౌదరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడ కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేశు, నాయకులు పాల్గొన్నారు.



వెంకటంపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న పరిటాల సునీత

నేడు కల్లూరుకు బాలకృష్ణ రాక

కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి

శింగనమల, ఏప్రిల్ 13: గార్లదిన్నె మండలంలో కల్లూరులో కూటమి హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి, సినీనటుడు నందమూరి బాలకృష్ణ బహిరంగసభ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఉందని కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి తెలిపారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గుర్రప్పనాయుడు, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు ముంటిమడుగు కేశవరెడ్డి లతో కలిసి ఆమె శనివారం మండలం లోని పోతురా జుకాల్వ మీడియాతో మాట్లాడారు. ఈ బహిరంగ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి... విజయవంతం చేయాలని కోరారు. కాగా, పోతురాజుకాల్వ గ్రామానికి చెందిన 15 వైసీపీ కుటుంబాలు వీరి ఆధ్వర్యంలో టీడీపీలో తీర్థం పుచుకున్నారు. అనంతరం మండలంలోని శివపురం, సీ.బండమీదపల్లి, చక్రాయపేట, పోతురాజుకాల్వ, సోదనపల్లి, వెస్టునరసాపురం గ్రామాల్లో బండారు శ్రావణిశ్రీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మం డల టీడీపీ కన్వీనర్ ఆదినారాయణ, డేగల కృష్ణమూర్తి, మారుతి నాయుడు, షాలిని, ఈశ్వర్‌రెడ్డి, చిదనందనాయుడు, విశాలాక్షి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బండారు శ్రావణి

వైసీపీకి కొమ్ముకాసే అధికారులను తొలగించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

అనంతపురం విద్య, ఏప్రిల్ 13: ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలవాలని వైసీపీ చూస్తోందని, ఆ పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులను ఎన్నికల కమిషన్ విధుల నుంచి తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో అనంతపురం, సత్యసాయి జిల్లా కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్‌తో కలసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సైతం వైసీపీకి వంతుపాడుతున్నారని, ఆయనను విధుల నుంచి తప్పించాలని కోరారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్ల ట్యాపింగ్ వ్యవ హారం కూడా బట్టబయలైందన్నారు. గత ప్రభుత్వాలు ఒకరినొకరు తిట్టుకోవడం మినహా ప్రజా సమస్యలపై చర్చిం చిన పాపాన పోలేద న్నారు. ఇండియా కూటమి పార్టీల అభ్యర్థులను అసెంబ్లీకి పంపినప్పుడే ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. ఇండియా కూటమి అనంతపురం అసెంబ్లీ అభ్యర్థి జాఫర్‌ను అన్ని వర్గాల ప్రజలు గెలిపించాలన్నారు. జాఫర్ మాట్లాడుతూ... సీఎం జగన్ ఈ ఐదేళ్లలో అవినీతి, అక్రమాలకు లక్ష్యంగా పాలన చేశారన్నారు. నగరంలో భూగర్భ డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు చేపడతామన్న అనంతపురం ఎమ్మెల్యే అనంత పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి జాడే లేదని ఎదేవా చేశారు. సీపీఐతోనే నగరంలోని సమస్యలపై పోరాటం ఉంటుందని, ప్రతి ఒక్కరూ కంకి కొడవలి గుర్తుకే ఓటు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి అల్లిపీరా, ఇతర నాయకులు లింగమయ్య, నారాయణస్వామి, సంతోష్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న జగదీష్

బాలకృష్ణ యాత్రను జయప్రదం చేయండి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 13: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేపట్టిన స్వర్ణాంధ్ర సాకార బస్సు యాత్రను జయప్రదం చేయాలని అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ కోరారు. శనివారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం నగరంలోని ప్రధాన కూడళ్లల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ... ఆదివారం సాయంత్రం 5 గంటలకు సప్తగిరి సర్కిల్‌లో జరిగే బహిరంగ సభలకు పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలన్నారు.

గార్లదిన్నె : హిందూపురం శాసన సభ్యుడు నందమూరి బాలకృష్ణ స్వర్ణాంధ్ర సాకార యాత్రలో భాగంగా ఆదివారం గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో చేపట్టే బస్సు యాత్రను విజయవంతం చేయాలని శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గంలోని టీడీపీ, జనసేనా, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

జంగాలపల్లిలో టీడీపీ ప్రచారం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 13: మండలంలోని కందుకూరు పంచాయతీ జంగాలపల్లి గ్రామంలో బాబు సూపర్ సిక్స్, బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాలను మండల నాయకులు శనివారం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగేమురళీ తదితరులు గ్రామ నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ పథకాలను ప్రజలకు వివరించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 13: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు దగ్గుబాట వెంకటేశ్వర ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణను గెలిపించుకుందామని జడ్పీ మాజీ ఛైర్మన్ దివంగత చమన్‌సాబ్ కుమారుడు, టీడీపీ యువనేత ఉమర్ ముక్తార్ పిలుపునిచ్చారు. శనివారం 42వ డివిజన్‌లో దగ్గుబాటి నిర్వహించిన ప్రచారంలో ఉమర్ మాట్లాడారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రతిఒక్క రూ ఆలోచించి టీడీపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రాయల సీమ బలిజ యువజన సంఘం అధ్యక్షుడు రమేష్, మాజీ జడ్పీటీసీ విశాలాక్షి, జయరాం నాయుడు, సంగా తేజస్విని, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికి

ఆత్మకూరు, ఏప్రిల్ 13 : మండలంలోని పీ యాలేరు గ్రామానికి చెందిన పది వైసీపీ కుటుంబాలు శనివారం అనంతపురంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరాయి. పరిటాల శ్రీరామ్ సమక్షంలో ఆ కుటుంబ సభ్యులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

అనంతపురంరూరల్ : మండలంలోని పాపంపేట పంచాయతీ వికేనగర్, బసవతారకం నగర్‌కు చెందిన 15 వైసీపీ కుటుంబాల నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరాయి. శనివారం అరవిందనగర్‌లోని మాజీ మంత్రి పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు భరత్, నాయకులు పాల్గొన్నారు.

తోపుదుర్తి కుటుంబీకులతోనే రాప్తాడులో దారుణాలు

టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం



అనంతపురం విద్య, ఏప్రిల్ 13: రాప్తాడు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యుల వల్లే రాప్తాడు నియోజకవర్గంలో దారుణాలు జరుగుతున్నాయని, వారి దోపిడీ, దౌర్జన్య పాలనకు తట్టుకోలేకనే... ప్రజలు టీడీపీలోకి స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం పేర్కొ న్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చాక తోపుదుర్తి కుటుంబీలకు నియోజకవర్గంలో ఇసుక, ఎర్ర మట్టి అమ్ముకుని కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నారని విమర్శలు గుప్పిం చారు. వాళ్ల అక్రమాలు, దోపిడీ చూసిన ప్రజలు ఈ ఎన్నికల్లో వాళ్లను ఓడించడానికి ఎదురు చూస్తు న్నారన్నారు. వాళ్ల దౌర్జన్యాలు చూసి తోపుదుర్తి సొంత గ్రామస్థులు, సొంత కులస్థులు, సొంత పార్టీ వాళ్లే స్వచ్ఛందంగా టీడీపీలోకి వస్తున్నారన్నారు. అలాం టి వాళ్లపై కూడా దాడులు చేయించడం వారి నీచ సంస్కృతికి నిదర్శమన్నారు. రాజకీయంగా పబ్బంగడపాలని తనపై కేసులు పెట్టించినా.., అక్రమంగా రౌడీ షీట్ ఓపెన్ చేయించినా.... భయపడేది లేదని, తన ప్రాణం ఉన్నంత వరకూ పరిటాల కుటుంబంతోనే ఉంటానని, టీడీపీలోనే ఉంటానని స్పష్టం చేశారు.

నీలిమ మైత్రాకు నివాళి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 13 : ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అఖిల భారత వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి నీలిమ మైత్రాకు సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నీలిమ మైత్రా శుక్రవారం ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సంతాపసభ నిర్వహించారు. నీలిమ మైత్రా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బృందాకరత్ ఉద్యమ జ్ఞాపకాల 'రీటా నేర్పిన పాఠం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, ప్రధాన కార్యదర్శి రమాదేవి, కోశాధికారి జమున, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై నిఘా వేయండి: ఎస్పీ



అనంతపురం క్రైం, ఏప్రిల్ 13: జిల్లాలో అక్రమ మద్యాన్ని అరికట్టడానికి గట్టి నిఘా వేయాలని ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశించారు. శనివారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లోని సెబ్ విభాగం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది ఆరంభం నుంచి జిల్లాలో సెబ్ విభాగం అధికారులు, బృందాలు జరిపిన దాడులు, నమోదైన కేసులు, నిందితుల అరెస్టులు, బైండోవర్లు, ఎన్‌డీపీఎల్, డీపీఎల్ సీజర్స్, నాటుసారా స్వాధీనంపై సమీక్షించారు. ఎన్నికలు ఫ్రీ, ఫెయిర్‌గా జరగాలంటే అక్రమ మద్యం కట్టడి కీలకమన్నారు. ఇతర రాష్ట్రాల మద్యం జిల్లా సరిహద్దుల్లోకి కూడా రాకుండా గట్టి నిఘా వేయాలన్నారు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహించడంతో పాటు జిల్లాలోకి ప్రవేశించే ప్రత్యామ్నాయ మార్గాలు, అడ్డదారులు, బండి జాడలు, కాలినడక రహదారులపై నిఘా వేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఇతర రాష్ట్రాల మద్యం జిల్లాలోకి ప్రవేశించరాదని సూచించారు. సమావేశంలో సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ, ఏఈఎస్ మంగ శ్రీరాం, స్పెషల్ బ్రాంచి సీఐ జాకీర్ హుస్సేన్, జిల్లాలోని సెబ్ సీఐలు, డీటీఎఫ్, ఇంటెలిజెన్స్ స్పెషల్ బృందాల సెబ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభగల విద్యార్థులకు అభినందన

అనంతపురం విద్య, ఏప్రిల్ 13 : ఇండియన్ నేషనల్ సైర్స్ ఒలంపియాడ్ 2వ లెవల్ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని శ్రీచైతన్య పాఠశాలలో ఆ విద్యార్థులను శనివారం అభినందించిన ఆయన మాట్లాడారు. ఏటీపీ 8వ బ్రాంచ్‌కు చెందిన చరితార్థ్ రెడ్డి 2వ బహుమతి, సభిహా సుల్తానా 3వ బహుమతి, అద్రిక రాయ్ 4వ బహుమతి, ఆధ్యావైభవి, హన్విక, అధ్విక పాయల్, అంకిత స్పెషల్ బహుమతులు సాధించారన్నారు. ఇండియన్ నేషనల్ సైర్స్ ఒలంపియాడ్ 2వ లెవల్‌లో ఏకంగా 73 బహుమతులు వచ్చాయన్నారు. అనంతరం విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు, మెడల్స్ అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నేత్రావతి, కో ఆర్డినేటర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, డీన్ అరుణ్ కిరణ్, ఇతరులు గంగాధర్, పూజ, దేవకృప, రషీదా, టీచర్లు పాల్గొన్నారు.

రాప్తాడు : మండలంలోని గొల్లపల్లి సమీపంలోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు ఇంటసో పరీక్షలో ప్రతిభ కనబర్చినట్లు ఆ పాఠశాల ఎండీ భరత్ తెలిపారు. ఇంటసో సామర్థ్య పరీక్షలో 1000 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 391 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, రెండవ భాగానికి 116 మంది ఎంపికయ్యారని అన్నారు. ఆ విద్యార్థులు బంగారు పతకాలు, ట్యాబ్‌లు సాధించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కృష్ణ సమీరా, ప్రిన్సిపల్ ప్రతాప్‌రెడ్డి, కో ఆర్డినేటర్ పక్కీరయ్య పాల్గొన్నారు.





శ్రీచైతన్య విద్యార్థులతో ఏజీఎం సుబ్బారెడ్డి, బహుమతులు అందుకున్న మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు

కళ్యాణదుర్గంలో టీడీపీదే గెలుపు

● రోడ్ షోలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, అమిలినేని సురేంద్ర బాబు


శెట్టూరులో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రజానీకం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 13: కళ్యాణదుర్గం కంచుకోటలో గెలిచేది టీడీపీనేనని ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం శెట్టూరులో నిర్వహించిన రోడ్ షోకు భారీగా జనం తరలివచ్చారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీపై వస్తున్న ఆదరణ చూస్తుంటే భారీ మెజార్టీ రావడం ఖాయమన్నారు. చంద్రబాబు నాయుడు సీఎం అయితే గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. నియోజకవర్గంలో 114 చెరువులకు నీరు నింపడమే కాకుండా బీటీపీ కాలువను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కళ్యాణదుర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తా: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు హామీ ఇచ్చారు. శనివారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద సురేంద్ర బాబు ఆధ్వర్యంలో 40 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ముద్దినాయనపల్లి, హులికల్లు గ్రామాలకు చెందిన వైసీపీ కుటుంబాలకు పార్టీ కండువావేసి టీడీపీలోకి ఆహ్వానించారు.

మహాశక్తి పథకాలతో మహిళలకు ఆర్థిక చేయూత

బ్రహ్మసముద్రం: మహాశక్తి పథకాలతో మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థి సురేంద్రబాబు సతీమణి రమాదేవి అన్నారు. మండలంలోని గొంచిరెడ్డిపల్లి గ్రామంలో సురేంద్రబాబు సోదరి రాధా మాధవితో కలిసి ఆమె ప్రచారం చేశారు. అలాగే నాగిరెడ్డిపల్లి, సంతె కొండాపురం గ్రామాల్లో అమిలినేని మేనల్లుడు రాహుల్ బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి టీడీపీని గెలిపించుకుందామని ఆయన కోరారు. గోవిందయ్యదొడ్డిలో సురేంద్రబాబు బావమరిది రాజగోపాల్ ప్రచారం చేశారు.



టీడీపీలో చేరిన వారితో పార్టీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

వైసీపీకి బిగ్ షాక్

● టీడీపీలో 500 కుటుంబాల చేరిక


టీడీపీలో చేరిన వారిని ఉద్దేశించి మాట్లాడుతున్న కాలవ

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 13: రాయదుర్గం నియోజకవర్గంలో వైసీపీకి బిగ్‌షాక్ తగిలింది. నిన్నటి వరకు వైసీపీలో కీలకంగా ఉన్న ఈడిగ కుటుంబాలు శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వైసీపీ నాయకులైన గురుప్రసాద్, సాయిప్రకాష్, అరవింద్, రంగనాథ్, గోపి, సురేష్‌బాబు, రంజిత్‌కుమార్, రాకేష్, రామాంజినేయులు, సిద్ధప్ప, గురుస్వామి, ఏకాంతప్ప ఆధ్వర్యంలో ఈడిగ, ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన 500 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కాలవ విజయమే లక్ష్యం: కాలవ శ్రీనివాసులు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి విజయమ్మ పట్టణంలోని 11, 12 వార్డులలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాయదుర్గం ప్రజలు టీడీపీ పార్టీకే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ ప్రశాంతి, మాజీ కౌన్సిలర్ బండి భారతి, పొరాళు పురుషోత్తం, కడ్డిపూడి మహబూబ్‌బాషా, నాగరాజు, బండి కృష్ణమూర్తి, సంపత్‌కుమారి, పూజారి శివ పాల్గొన్నారు.

కాలవను గెలిపించండి: రాయదుర్గం ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే కాలవ శ్రీనివాసులును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కాలవ భరత్ కోరారు. శనివారం మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా అప్పలాపురం ఆంజనేయస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జి మంజునాథగౌడ్, కాటా వెంకటేశులు, కన్వీనర్ హనుమంతు, సర్పంచులు అశోక్, రాజశేఖర్‌రెడ్డి, మల్లేశప్పపాల్గొన్నారు.

జనాగ్రహంలో వైసీపీ కొట్టుకుపోతుంది

● టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లక్ష్మీనారాయణ, జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 13: జనాగ్రహంతో వైసీపీ ప్రభుత్వం కూలిపోతుందని టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లక్ష్మీనారాయణ, జయరాం అన్నారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలో టీడీపీ ప్రచార ర్యాలీని నిర్వహించారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు పాతగుంతకల్లులోని వాల్మీకి సర్కిల్ వద్దకు చేరుకుని ర్యాలీలో పాల్గొన్నారు. మెయిన్ రోడ్డు గుండా ర్యాలీ కొనసాగి పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో బహిరంగ సభను నిర్వహించారు. గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కబ్జాలతో అరాచకం చేసి, నాపై దౌర్జన్యపరుడని ముద్రవేసేందుకు యత్నిస్తున్నాడని, నిరూపిస్తే ఎన్నికల నుంచి తప్పుకుంటా అన్నారు. పట్టణ అధ్యక్షుడు బండా రు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, పత్తి హిమబిందు, తిమ్మప్ప, మస్తాన్, లక్ష్మీనారాయణ, శీన, జనసేన వాసగిరి మణికంఠ, బీజేపీ హరిహరనాథ్, రామాంజనేయులు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రెండు ఓట్లూ సైకిల్‌కే వెయ్యండి: ఎన్నికల్లో రెండు ఓట్లూ సైకిల్ గుర్తుపై వేసి టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ జయరాం, లక్ష్మీనారాయణ ఓటర్లను కోరారు. శనివారం ఉదయం పట్టణంలోని తిలక్ నగర్‌లో ప్రజాగళం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు.

ర్యాలీలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు


టీడీపీలోకి పలు కుటుంబాలు చేరిక

పామిడి: పట్టణంలోని చైతన్య కాలనీకి చెందిన 20 కుటుంబాలు శనివారం మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ సమక్షంలో టీడీపీలోకి చేరాయి. గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ప్రభాకర్ చౌదరి, బొల్లు శ్రీనివాసరెడ్డి, ముసలిరెడ్డి, మోహన్ కృష్ణ, జనసేన ధనుంజయ, బీజేపీ అంజినాయక్ పాల్గొన్నారు. మండలంలోని ఖాదర్‌పేట, ఓబుళాపురం గ్రామాల్లో శనివారం నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈశ్వర్ పర్యటించారు.

అంబేడ్కర్ స్ఫూర్తిగా ఉచిత వైద్యసేవలు



అంబేడర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట, ఏప్రిల్ 13: అంబేడ్కర్ స్ఫూర్తిగా దాతలు నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు అందించాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని తాళ్లకెర గ్రామంలో శనివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని దళిత యువకుడు వెంకటేశులు ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కాలవ హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి దళిత యువత చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాలవ సన్నన్న, కేపీదొడ్డి నాగరాజు, సత్యనారాయణరెడ్డి, శ్రీరాములు, ఓబుళేసు, ఎస్సీ సెల్ నాయకులు చిన్న కిష్టయ్య, అంజి, రవికుమార్ పాల్గొన్నారు.

'ఎవరూ ఆర్థికసాయం చేయలేదు'

పుట్లూరు, ఏప్రిల్ 13: మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డికి ఎవరూ ఆర్థికసాయం చేయలేదని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడవకల్లుకు చెందిన పెద్దయ్యకు మాత్రమే ఇచ్చినట్లు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

యాడికి, ఏప్రిల్ 13: ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని బీఎస్‌ఎఫ్ డీఎస్పీ చౌదరి, యాడికి సీఐ నాగార్జునరెడ్డి సూచించారు.శనివారం మండలకేంద్రం యాడికిలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మండలంలోని నిట్టూరు, చందన, వేములపాడు గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో కవాతు నిర్వహించారు.

వైభవంగా పల్లకి సేవ


ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఏప్రిల్ 13: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈవో విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన ప్రొఫెసర్ల బృందం


కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ల బృందం సభ్యులు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 13: పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలను ఎస్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ల బృందం శనివారం సందర్శించింది. రిజిస్ట్రార్ లక్ష్మయ్య, కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ప్రొఫెసర్ రామ్‌గోపాల్, కెమిస్ట్రీ ప్రొఫెసర్ వెంకటరమణ కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ, జిమ్, క్రీడామైదానం, పరీక్షల విభాగం, విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ 2023 జూన్‌లో న్యాక్ ఏ గ్రేడ్ కేటాయించిందని, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ ఆదేశాల మేరకు కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా కోసం యూజీసీ, ఢిల్లీకి దరఖాస్తు చేసుకున్నామన్నారు. కళాశాల కోఆర్డినేటర్ రవిశంకర్ శర్మ, అధ్యాపకులు, పాల్గొన్నారు.

టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 13: రాష్ట్రంలో టీడీపీ గెలుపును ఎవరూ ఆపలేరని మాజీ సర్పంచ్ బెళ్లి హనుమంతరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నేమకల్లులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇంటింటికి తిరుగుతూ పథకాల గురించి వివరించారు. మాజీ సర్పంచ్ బెళ్లి హనుమంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, టీడీపీ నాయకులు గాలి బసప్ప, రవిచంద్రసాగర్, గోనేహాళ్ దొడ్డ హనుమంతు, పూజారి గోవింద, పూజారి నరసింహ, గోనేహాళ్ ప్రశాంత్, గోనల్ కల్లప్ప, వసుకురుబ శ్రీకాంత, దేవునూర్ హనుమంతు, బెళ్లి వన్నూరప్ప, బెళ్లి గాదిలింగప్ప, బోయ తిప్పేస్వామి పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

గుమ్మఘట్ట: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న అన్నారు. శనివారం సాయంత్రం టీడీపీ ఇంటింటి ప్రచారంలో భాగంగా కలుగోడు గ్రామంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తూ టీడీపీ కూటమి అభ్యర్థి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. దేవరాజ్, బషీర్, నీరగంట తిమ్మప్ప, గొల్ల గోవిందప్ప, ముచ్చరపల్లి తిప్పేస్వామి, వెంకటేశులు పాల్గొన్నారు.


నేమకల్లులో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు

సూపర్‌సిక్స్ పథకాలతో నూతన వెలుగులు

కణేకల్లు: సూపర్‌సిక్స్ పథకాల వల్ల ప్రజలు ఎంతో లబ్ధిపొందుతారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని మాల్యం గ్రామంలో ప్రభాకర్, యువరాజ్‌గౌడ్, అశోక్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. కృష్ణారెడ్డి, చంద్ర, హరి, నూరి, గురుస్వామి, జిలాన్, బసవరాజు, శ్రీరాములు, వండ్రప్ప, ఎల్లప్ప, జనసేన రామ్ పాల్గొన్నారు.

టీడీపీకి పట్టం కట్టండి: అశ్మిత్ రెడ్డి


యువకునితో కరచాలనం చేస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 13: సైకిల్‌గుర్తుకు ఓటువేసి టీడీపీకి పట్టం కట్టాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని జయనగర్‌కాలనీలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టోతోనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఆయన వివరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, బీజేపీ నాయకులు హరీష్‌రెడ్డి, గంగాధర్, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సైకిల్‌గుర్తుకు ఓటువేసి గెలిపించాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. శనివారం దిమ్మగుడి గ్రామంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు రామిరెడ్డి, దివాకర్‌రెడ్డి, గంగరాజుయాదవ్, ప్రసాద్‌యాదవ్, నాగరాజు, చిరంజీవులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెంకటశివుడు యాదవ్‌తో అంబికా భేటీ


వెంకటశివుడుయాదవ్‌తో అంబికా లక్ష్మీనారాయణ

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 13: కూటమి అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ శనివారం పట్టణంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్‌తో భేటీ అయ్యారు. స్థానిక బ్యాంక్ కాలనీలోని వెంకటశివుడు కార్యాలయానికి అంబికా వెళ్లారు. ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని అంబికా కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో 11వ వార్డు ఇన్‌చార్జి పరశురాం, గుజరిఖాజా, నారాలోకేష్‌ఫౌండేషన్ అధ్యక్షుడు అశోక్, న్యాయవాది రమేష్, నాయక్, వాల్మీకి రమణ, ప్రవీణ్, బాబు, కదిరప్ప, వాల్మీకిరాము పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారు


వృద్ధురాలితో మాట్లాడుతున్న విక్రమసింహా

ఉరవకొండ, ఏప్రిల్ 13: వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమసింహా అన్నారు. మండలంలోని మోపిడి గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. టీడీపీ నాయకులు విజయ్‌భాస్కర్, దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, రంగప్పచౌదరి, గోవిందు, వెంకటేశులు, వెంకటరమణ, మదమంచి వెంకటేశులు, దగ్గుపాటి హరి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ... ఒకరి మృతి

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 13: ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో తిప్పేస్వామి(33) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. కర్ణాటక ఉర్థాల్ గ్రామానికి చెందిన తిప్పేస్వామి తన స్నేహితుడు రమేష్ ద్విచక్రవాహనంపై శనివారం బళ్లారి వైపు నుంచి రాయదుర్గానికి వస్తుండగా బాదనహాళ్ గ్రామ సమీపంలోకి రాగానే రాయదుర్గం వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో తిప్పేస్వామి అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ వారిని మెరుగైన చికిత్స కోసం బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం సీజ్


పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న సెబ్ పోలీసులు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 13: పట్టణ సమీపంలోని గొల్లపల్లి రోడ్డు రైల్వేగేట్ సమీపం కొండగుట్ట వద్ద 16 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సెబ్ సీఐ మురళీమోహన్ తెలిపారు. సెబ్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కొండగుట్ట వద్ద టార్పాలిన్ కింద ఉంచిన మద్యాన్ని బీటీఎఫ్ సెబ్ సీఐ, ఎస్ఐ భాస్కర్ దాడులు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. టార్పాలిన్ కింద 16 బాక్సులు 1536 టెట్రా ప్యాకెట్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాయదుర్గానికి చెందిన ప్రసాద్, రవిలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని జయనగర్ 5వరోడ్డులో నివాసం ఉంటున్న షేక్‌హాజీ అనే వ్యక్తి నుంచి 18 మద్యం బాటిళ్లను శనివారం సీజ్ చేసినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు. షేక్ హాజి మద్యం బాటిళ్లను అధిక ధరలకు విక్రయిస్తున్నాడని అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి నిందితునిపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

యాడికి, ఏప్రిల్ 13: ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని పలువు రు రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని తెలిపారు. రౌడీషీటర్లు తమ ప్రవర్తనను పూర్తిగా మార్చుకోవాలని సూచించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఈవీఎంలు


ఈవీఎం బాక్సులను పరిశీలిస్తున్న ఆర్వో

ఉరవకొండ, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈవీఎంలు స్ట్రాంగ్ రూంకు చేరాయి. పట్టణంలోని జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూంకు శనివారం అనంతపురం నుంచి ఈవీఎంలు తీసుకొచ్చారు. రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో ఈఆర్వో శిరీష, ఏఈఆర్వో శ్రీనివాసులు, ఈవీఎంలను భద్రపరిచారు. ఆర్వో జేసీ కేతన్‌గార్గ్ స్ట్రాంగ్‌రూంలో ఈవీఎం బాక్సులను పరిశీలించారు. డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, సీఐలు, సురేష్‌బాబు, ప్రవీణ్‌కుమార్, రాజకీయపార్టీ నాయకులు విజయ్‌భాస్కర్, నెట్టెంశివ, సోనియా శ్రీన, అబ్బాస్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

బలహీనవర్గాలను ఆదుకున్న ఘనత టీడీపీదే


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున

బెళుగుప్ప, ఏప్రిల్ 13: ఎన్నో సంక్షేమాభివృద్ధి పథకాలతో బలహీనవర్గాలను ఆదుకున్న ఘనత టీడీపీదే నని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుండ్లపల్లిలో జయహో బీసీ సదస్సు టీడీపీ ఆధ్వర్యంలో కన్వీనర్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు ఎన్టీఆర్ పెద్దపీట వేశారన్నారు. ప్రస్తుతం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు బీసీ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. 50 యేళ్లకే నెలకు రూ. 4 వేలు పింఛన్, సబ్ ప్లాన్, 34 శాతం రిజర్వేషన్లు, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు, ప్రత్యేక రక్షణ చట్టం, కులవృత్తులు, ఆదరణ పతకం, పునరుద్ధరణ లాంటి సంక్షేమ పథకాలతో టీడీపీ ఆదుకోగా సీయం జగన్మోహన్ రెడ్డి వీటన్నింటిని రద్దు చేసి బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు. టీడీపీ అండగా వుండి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో పెద్దఎత్తున టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది టీడీపీనే


మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ రంగయ్య

యాడికి, ఏప్రిల్ 13: ఎన్నికల కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, అధికారంలోకి వచ్చేది తెలుగుదేశం పార్టీయేనని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య అన్నారు. శనివారం మండలంలోని రాయలచెరువులో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులపై వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. నాయకులు పరిమి చరణ్, బాబుగౌడ్, గోపాల్‌నాయుడు, మాదాల అనిల్, శోభన్‌బాబు, శేఖర్, నాగరాజు గౌడ్, జాఫర్, శరభారెడ్డి, నరేంద్రబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా రససిద్ధేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 13: రాయదుర్గం పట్టణంలోని సిద్దులకొండపై వెలసిన రససిద్ధేశ్వరస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద నుంచి సిద్ధులకొండ వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు స్వామివారి ఊరేగింపులో పాల్గొని స్వామి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం సిద్ధులకొండపై రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం సిడి మానోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పాలే కమిటీ సభ్యులు తెలిపారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు


అలంకరణలో స్వామివారు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 13: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి వారికి చైత్రమాసం తొలి శనివారం సందర్భంగా విశేషపూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు పూజలు నిర్వహించారు. వేకువజామున, సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణు పారాయణం, అష్టోత్తర నిర్వహించి వెండికవచ అలంకరణ, పుష్పలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు. మాజీ ధర్మకర్త కాశీనాథ్‌శెట్టి సిబ్బంది ఓబున్న పాల్గొన్నారు.

17న సీతారాముల కల్యాణం

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 13: మండలంలోని పాలవెంకటాపురం గ్రామంలో 17వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త అమరలింగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే కేశవ్‌ను విమర్శించే అర్హత ప్రణయ్‌రెడ్డికి లేదు

బెళుగుప్ప, ఏప్రిల్ 13: అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను విమర్శించే అర్హత వైసీపీ నాయకుడు ప్రణయ్‌రెడ్డికి లేదని టీడీపీ నాయకుడు లక్ష్మీ నారాయణ మండిపడ్డారు. మండలంలోని ఎర్రగుడిలో శుక్రవారం ప్రణయ్‌రెడ్డి ఎమ్మెల్యే పయ్యావుల కేశవను వలసపక్షి, అభివృద్ధికి కృషి చేయలేదని విమర్శించడంతో ఆయన చేసిన ఆరోపణలను ఖండించారు. మీరు కబ్జాల సంఘానికి అధ్యక్షుడిగా పేరుందన్నారు. తమ గ్రామానికి తారు రోడ్డుతో పాటు కల్వర్టు నిర్మించేందుకు కృషి చేసిన ఘనత పయ్యావులకు దక్కుతుందన్నారు.

కాంగ్రెస్ ప్రచారం

కూడేరు, ఏప్రిల్ 13: మండలంలోని మరుట్ల 1, 2 కాలనీల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుసూదన్ రెడ్డితోపాటు నిఖిల్‌నాథ్ రెడ్డి, అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని మధుసూదన్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.19/2024

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్పూటెంట్
వర్సెస్
బి.శ్రీరామమూర్తి మరియు ఇతరులు - అపోనెంట్స్

అపోనెంట్ 3 కినోటీసు

3.పి.మణిదీప్ తండ్రిః పి.వెంకటేశ్వర్లు, వయస్సుః 22 సం॥లు. ఉద్యోగి: జూనియర్ క్లర్క్, ఆఫీసు/ ఆఫ్ Dy.Cmm G & S MFT Stores, యస్.సి.రైల్వేస్, సికింద్రాబాదు, నివాసం: డో.నెం.15-276, రాచన్న వీధి, గుంతకల్, అనంతపురం జిల్లా.

డిస్పూటెంట్, డిస్పూట్ బాకీమొత్తం రూ. 3,00,936/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్పూట్‌లో 3కి అపోనెంట్ అయిన మీరు 15-05-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్పూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.79/2023

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాయదుర్గం బ్రాంచ్
-- డిస్పూటెంట్
వర్సెస్
కురుబ గాధిలింగప్ప మరియు ఇతరులు - అపోనెంట్స్

అపోనెంట్ 2 మరియు 3 కినోటీసు

2.యం.శ్రీశైల తండ్రిః యం.మారయ్య, వయస్సుః 57 సం॥లు. ఉద్యోగి: ప్రైమరీ స్కూలు, అసిస్టెంట్ గవర్నమెంటు ప్రైమరీ స్కూలు,మెలకాల్మూరు తాలుకా, చిత్రదుర్గ జిల్లా, కర్నాటక రాష్ట్రం.నివాసం:అంబేద్కర్ వీధి, మెలకాల్మూరు తాలుకా, చిత్రదుర్గ జిల్లా.

3.కురుబ కరివీర స్వామి తండ్రిః కె.నాగేంద్రప్ప, వయస్సుః 49 సం॥లు. ఉద్యోగి:క్లీనర్, ఎపియస్‌ఆర్‌టిసి, కళ్యాణదుర్గం,నివాసం:డో.నెం.8-1-64/9, మేదర్‌వీధి,రాయదుర్గం, అనంతపురం జిల్లా.

డిస్పూటెంట్, డిస్పూట్ బాకీమొత్తం రూ. 1,48,679/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్పూట్‌లో 2 మరియు 3కి అపోనెంట్ అయిన మీరు 15-05-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్పూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu